క్లుప్తంగా

సామూహిక సీమంతాలు



గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

సామర్లకోట: మాధవపట్నం గ్రామంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ ఉష మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సామూహిక సీమంతాలు టీడీపీ కార్యాలయంలో అధికారులు నిర్వహించడంపై గ్రామ సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ అభ్యంతరం వ్యక్తం చేశారు. మహిళా సర్పంచ్‌ను అవమానించారని తెలిపారు. ఐసీడీఎస్ అధికారుల నిర్వహించే కార్యక్రమం ప్రభుత్వ కార్యాలయంలో నిర్వహించాలన్నారు. దీనిపై సీడీపీఓ ఉషను వివరణ కోరగా గ్రామానికి చెందిన నాయకులు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసి గర్భిణులకు కొన్ని సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరడంతోనే ఈ కార్యక్రమానికి హాజరయ్యారమన్నారు. సామూహిక శ్రీమంతాలు ప్రభుత్వ కార్యక్రమం కాదని సీడీపీఓ తెలిపారు. గ్రామ నాయకుడు వెంటేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తిలో ఆయిల్‌పామ్ విస్తరణ కార్యక్రమాలు



ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న అధికారులు

పిఠాపురం: వెల్దుర్తిలో రైతు కందుల బంగారం పొలంలో మంగళవారం ఆయిల్ పామ్ నాట్ల కార్యక్రమం పతంజలి కంపెనీ, ఉద్యానశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పిఠాపురం ఉద్యాన శాఖాధికారి వైఎస్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత ఆయిల్ పామ్ ఎఫ్ఎఫ్‌బీ ధరలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు అనుకూలంగా ఉన్నందున ఆయిల్ పామ్ సాగు చేయాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పతంజలి కంపెనీ మేనేజర్ బి.వెంకటేశ్వర్లు, క్లస్టర్ ఆఫీసర్ కామేశ్వర్, కంపెనీ ప్రతినిధులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రంగరాజన్ జయంతి



రంగనాథన్‌కు నివాళులర్పిస్తున్న గ్రంథపాలకుడు నాగరాజు తదితరులు

పెద్దాపురం: లైబ్రేరియన్ డేను పురస్కరించుకుని స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో భారతీయ గణిత శాస్త్రజ్ఞుడు, గ్రంథపాలకుల గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ 133వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రథమ శ్రేణి గ్రంథపాలకుడు పాలంకి నాగరాజు రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు ఎస్.చిరంజీవి, కె.దుర్గాప్రసాద్, జి.శివకృష్ణ, వి.సుదీర్ తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోట జయలక్ష్మి థియేటర్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు



సామర్లకోటలో చెరువులా మారిన వెలమపేట రోడ్డు



కొత్తపల్లిలో కురుస్తున్న వర్షం

కుండపోత వర్షం

- చెరువుల్లా మారిన రోడ్లు
- పొంగి ప్రవహించిన డ్రైనేజీలు
- రెండు గంటల పాటు నిలిచిన విద్యుత్తు సరఫరా

సామర్లకోట: పట్టణ, మండలంలో మంగళవారం మధ్యాహ్నం సుమారు 30 నిమిషాల పాటు కుండపోత వర్షం కురిసింది. వర్షానికి రోడ్లన్నీ చెరువులుగా మారాయి. డ్రైన్లు పొంగిప్రవహించాయి. వర్షం కారణంగా మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇటీవల ప్రధాన డ్రైన్లలో సుమారు రూ.30లక్షలతో పూడికతీత పనులు జరిగినట్టు ప్రకటించారు. దాంతో పూడిక తీత పనులు వలన ప్రయోజనం శూన్యం అనే విమర్శలు వినిపించాయి. పూడిక తీత పనులు ప్రారంభం నుంచి పూడిక తీతలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపణలు చేసిన ఎవరూ పట్టించుకోలేదని వైఎస్సార్ సీపీ సీనియర్ కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ, నేతల హరిబాబులు ధ్వజమెత్తారు. ఇప్పటికైనా పూడిక తీతపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నారు. మంగళవారం కురిసిన వర్షానికి పట్టణంలో అన్ని రోడ్లు చెరువులుగా మారిపోవడమే దీనికి నిదర్శనమని అన్నారు. స్టేషన్ సెంటర్, బస్సు కాంప్లెక్స్, జయలక్ష్మి థియేటర్ రోడ్డు, సత్యనారాయణ పురం రోడ్డు, సంపెంగతోట, వెలమపేట, రథంసెంటర్, షిర్డిసాయిబాబా రోడ్డు, వెలమపేట, సంగీతరావుపేట, సీతారామ కాలనీ, భాస్కర్‌నగర్, కాకినాడ రోడ్లు చెరువులుగా మారి పోయాయి. స్టేషన్ సెంటర్‌లో రోడ్లపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అప్పయ్య చెరువు నుంచి డ్రైనులో నీటి ప్రవాహానికి సత్యనారాయణపురం రోడ్డు చెరువుగా మారింది. ఆ రోడ్డులో అడుగు అడుగునా గోతులు ఉండడంతో వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు. సత్యనారాయణపురం రోడ్డు మార్జిన్‌లో ఉన్న షాపులలోనికి వర్షపునీరు చేరింది. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి డ్రైనుల ద్వారా ప్రవహించే నీరు స్థానిక స్టేషన్ సెంటర్‌లోని ప్రధాన డ్రైనులోనికి చేరుతుంది. అయితే ఆ డ్రైను నిండిపోవడంతో జయలక్ష్మీ థియేటర్ రోడ్డు, స్టేషన్ సెంటర్లు చెరువులను తలపించాయి. బస్సు కాంప్లెక్స్ చెరువుగా మారిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రైల్వే స్టేషన్ సెంటర్‌లోని రోడ్డుపై నీరు నిలిచిపోయింది. డ్రైనలో పూడిక తీయడానికి అవకాశం లేకుండా డ్రైన్లను ఆక్రమించడంతో రోడ్లపై నీరు నిలిచిపోయిందనే వాదనలు ఉన్నాయి. రోడ్లపై ఉన్న వర్షపు నీరు డ్రైన్లలోనికి వెళ్లే అవకాశం లేకపోవడం వలన రోడ్లు చెరువుల్లా మారాయని పలువురు విమర్శించారు. అదేవిధంగా వీకే రాయపురం ఉండూరు, చంద్రపాలెం, గ్రామాలలోని పల్లపు ప్రాంతాలలమయమయ్యాయి.ఈ వర్షంతో వరి నాట్లకు మేలు జరుగుతుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు.



సామర్లకోట సత్యనారాయణపురం రోడ్డుతో వాననీటి ప్రవాహం

చెరువులు కాదు.. రోడ్లే

కొత్తపల్లి: మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి రోడ్లు చెరువులను తలపించాయి. సాయంత్రం మండలంలో కురిసిన వర్షానికి రైతులకు, ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది. వేసవిని తలపించే విధంగా ఎండలు మండిపోయాయి. తీవ్రమైన ఉక్కపోతతో జనజీవనం నిట్టూర్పులతో విలవిల్లాడింది. కురిసిన వర్షంతో ప్రజలకు ఉపశమనం లభించింది. ప్రధాన రోడ్లలో డ్రైనేజీలు పూడికతో మూసుకుపోవడంతో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



పిఠాపురం- ఉప్పాడ రోడ్డులో వాకతిప్ప వద్ద జలమయమైన రోడ్డు

ఉద్యాన పంటలకు ఈ-క్రాప్ తప్పనిసరి

జిల్లా ఉద్యానశాఖాధికారి విజయలక్ష్మి



అగ్రహారంలో ఆర్కిడ్ పూల తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

పిఠాపురం: ఉద్యాన పంటల రైతులు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా ఉద్యానశాఖాధికారి జి.విజయలక్ష్మి సూచించారు. ఆమె పిఠాపురం నియోజకవర్గంలో ఉద్యానశాఖ పథకాలపై పిఠాపురం ఉద్యానాధికారి వై.సోమ రాజశేఖర్‌తో కలిసి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు ఉద్యాన పంటలను పరిశీలించారు. పిఠాపురం మండలం అగ్రహారంలో భావనా ఫ్లోరికల్చర్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ కలెక్షన్ సెంటర్, అనంతరం గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలోని హరితవనం ఉద్యాన ఉత్పత్తిదారుల సహకార రైతు సంఘం లిమిటెడ్ కలెక్షన్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అందించే వివిధ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. అగ్రహారం గ్రామానికి చెందిన రైతు జవ్వాది వీరబాబు స్థాపించిన ఆర్కిడ్ పూల పాలీహౌస్‌ను ఆమె పరిశీలించి, పాలీహౌస్ షేడ్‌నెట్ ఏర్పాటుకు లభించే సబ్సిడీలను రైతులకు వివరించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో గ్రామ వ్యవసాయ సహాయకులు నిర్వహిస్తున్న ఈ-క్రాప్ బుకింగ్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి, బుకింగ్ వేగాన్ని పెంచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



సామర్లకోట నుంచి ర్యాలీ చేస్తున్న నాయకులు



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



చంద్రమాంపల్లిలో తిరంగా ర్యాలీ

సామర్లకోట: బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి పెద్దాపురం వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు పుప్పాల నాగగొవిందు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు గొరకపూడి చిన్నయ్యదొర, మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుంకవిల్లి బాపిరాజు, బీజేపీ నాయకులు వల్లూరి బుల్లియ్య, జానీమోజెస్, డి.విజయలక్ష్మి, కూనంశెట్టి అర్జునుడు, బాదిరెడ్డి రామకృష్ణ, పి.సుబ్బారావు, కొప్పన శ్రీను, ఎస్.జగదీష్, విటికర్ గరల్స్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ర్యాలీ

కొత్తపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడు పంపన శేషగిరి ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కుతుకుడుమిల్లి ఎంపీపీ పాఠశాల నుంచి కొత్తపల్లి ఊర చెరువు సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి జాతీయ జెండాలతో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రవణం సుబ్రహ్మణ్యం, తిరంగా కార్యక్రమం ఇంచార్జ్ దుర్గాప్రసాద్ గౌరీ శంకర్, చోడిశెట్టి రమేష్, యార్లగడ్డ రామ్‌కుమార్, గండి కొండలరావు, వరలక్ష్మీనారయణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం: చంద్రమాంపల్లి గ్రామం నుంచి దివిలి వరకూ విశ్వకవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో మంగళవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమ ఇన్‌చార్జి గొరకపూడి చిన్ని దొర పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు పోతుల వీర ప్రభాకరరావు, రేగులబంద మంగరాజు, సకుమళ్ళ రాజేశ్వరరావు, యానాల రాంబాబు, అడబాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి



సుబ్బారావును అభినందిస్తున్న వంగా గీత

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతా విశ్వనాథ్

పిఠాపురం: వైఎస్సార్ సీపీ అధిష్టానం మీపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతా విశ్వనాథ్ నూతనంగా పదవులు చేపట్టిన నేతలకు సూచించారు. పార్టీ రాష్ట్ర మేధావుల సంఘ విభాగ ఉపాధ్యక్షుడిగా నియమితులైన అనిశెట్టి సుబ్బారావు మంగళవారం పిఠాపురం పార్టీ కార్యాలయంలో ఆమెను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దీంతో ఆమె ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని చేసే సామర్థ్యం ఉన్న ప్రతి ఒక్కరికి పార్టీ పదవులు అప్పగిస్తున్నామని ప్రతి ఒక్కరూ మరింతగా కృషి చేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతు పార్టీ కోసం తన శక్తి వంచన లేకుండా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు గండేపల్లి బాబీ, బత్తుల సాయిరాం, జ్యోతుల భీముడు, కొతెంత దత్తుడు, రావుల మాదవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పెన్షన్ విధానాలపై అవగాహన ఉండాలి

- కింది స్థాయి ఉద్యోగులకు పెన్షన్ బాధ్యత ఎంపీడీఓలదే
- ఎంపీడీఓల శిక్షణలో రిసోర్సుపర్సన్ గండేశ్వరరావు

సామర్లకోట: ఉద్యోగుల పెన్షన్ విధానంపై ఎంపీడీఓలు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని రీసోర్సు పర్సన్ గండేశ్వరరావు అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో గత నెల 28వ తేదీ నుంచి శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకూ ఉన్న జిల్లాలో ఉద్యోగ ఉన్నతి పొంది ఎంపీడీఓలకు నెల రోజుల శిక్షణ జరుగుతోంది. దీనిలో భాగంగా మంగళవారం విశ్రాంత ఉద్యోగి సీనియర్ ఫ్యాకల్టీ గండేశ్వరరావు పెన్షన్ రూల్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఉద్యోగులకు అందే పెన్షన్‌లు సేవా పెన్షను, సూపరాన్యుయేషన్ పెన్షన్, రిటైర్‌మెంట్ పెన్షన్, కాంపెన్సేషన్ పెన్షన్, ఇన్వాలిడ్ పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్లు ఉంటాయన్నారు. ఉద్యోగి మృతి చెందిన సమయంలో కుటుంబ సభ్యులకు ఫ్యామిలీ పెన్షన్ ఇస్తారని తెలిపారు. ఉద్యోగి నిర్ణిష్ట వయస్సులో పదవీ విరమణ చేసిన సమయంలో సూపరాన్యుయేషన్ పెన్షన్ అందుతుందని చెప్పారు. ఉద్యోగి పోస్టు రద్దు అయిన సమయంలో అతని హోదాకు తగిన పోస్టు లభించని సమయంలో అతని సేవలు ఆధారంగా కాంపెన్సేషన్ పెన్షన్ అందుతుందన్నారు. ఉద్యోగిని శిక్షణగా ఉద్యోగం నుంచి తొలగించిన సమయంలో, ఉద్యోగి శాశ్వత అంగవైకల్యం పొందిన సమయంలో డాక్టరు సర్టిఫికెటు ఆధారంగా 2/3 వంతు ఇన్వాలిడ్ పెన్షన్ ఇస్తారని తెలిపారు. ఉద్యోగి కనీసం పదేళ్లు పని చేసిన సమయంలో మాత్రమే పెన్షన్ వర్తిస్తుందన్నారు. పెన్షన్ పొందడానికి ప్రతి ఏడాది లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని సూచించారు. పెన్షన్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండడం ద్వారా ఎంపీడీఓలు తమకు రావలసిన పెన్షన్, కార్యాలయంలో పని చేసే సిబ్బంది పెన్షన్‌తో పాటు కింది స్థాయి ఉద్యోగుల పెన్షన్‌ను నిర్ణయించడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ఉదయం ఈటీసీ సీనియర్ ఫ్యాకల్టీ శర్మ ఇప్పటి వరకు జరిగిన శిక్షణ విధానంపై రివ్యూ నిర్వహించారు.



ఎంపీడీఓలకు శిక్షణ ఇస్తున్న గండేశ్వరరావు

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కొత్తపల్లి: కొమరగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు వైద్యాధికారి రాజ్‌కుమార్ తెలిపారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ కందెపల్లి సత్యశ్రీ మాత్రలు వేశారు. పిల్లలకు వ్యక్తిగత శుభ్రత, హ్యాండ్ వాషింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించినట్టు చెప్పారు. పిల్లలకు, కిశోర బాలలకు కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే పోషకాహార లోపం, రక్తహీనత వల్ల నీరసం వస్తుంది. శారీరక, మానసిక ఎదుగుదల లోపాలను కలిగి ఉంటారన్నారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల నులుపురుగులు బయటకుపోయి పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ రాంబాబు, సూపర్ వైజర్స్ రత్నం, హనుమంతరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

సామర్లకోట: ప్రభుత్వం ప్రతి ఏడాది విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తుందని ఎంఈఓ 2 పి.పుల్లయ్య అన్నారు. స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం ఆల్బెండజోల్ (నులిపురుగుల నివారణ) మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులతో మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షత వహించగా మెడికల్ ఆఫీసర్ కె.ప్రభ తదితరులు పాల్గొన్నారు. పట్టణ మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలోను మాత్రల పంపిణీ జరిగింది.



కొమరగిరిలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న సర్పంచ్ సత్యశ్రీ

రైల్వేస్టేషన్‌లో షాపులు, క్యాంటీన్ల పరిశీలన

సామర్లకోట: రైల్వే స్టేషన్ పరిధిలో తినుబండారాలు విక్రయించే షాపులు, క్యాంటీన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం రైల్వే స్టేషన్‌లోని షాపులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తినుబండారాలను విక్రయించే సమయంలో కాగితాలను, చెత్తను డస్టుబిన్లలో వేయాలని కొనుగోలుదారులకు సూచించాలన్నారు. అదే విధంగా స్టాల్స్‌లో తినుబండారాలకు సంబంధించిన ధరల పట్టిక తప్పని సరిగా ఉండాలన్నారు. క్యాంటిన్‌లో నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను విక్రయించాలని నిర్వాహకులకు ఆధించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టరు కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టరు కేవీ గిరి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ మేరకు రైల్వే స్టేషన్‌లో ర్యాలీ నిర్వహించారు.



రైల్వే స్టేషన్‌లో స్టాల్స్‌ను తనిఖీ చేస్తున్న రైల్వే మేనేజరు తదితరులు

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా చిన్నా

సామర్లకోట: స్థానిక పెద్దాపురం ఆటో స్టాండ్ శ్రీలక్ష్మీ గణపతి ఆటో యూనియన్ అధ్యక్షుడిగా ఆర్.చిన్నా ఎన్నికయ్యారు. మంగళవారం ఆటో యూనియన్ సభ్యుల సమావేశం నిర్వహించి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వి.అచ్చుతా రామయ్య, కార్యదర్శిగా బి.బాసిబాబు, సహాయ కార్యదర్శిగా ఎస్‌కే భాషా, కోశాధికారిగా ఎ.శివ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రమణ, వీరబాబు, సుబ్రహ్మణ్యం, పి.వీరబాబు, కృష్ణ, జాన్ ఎన్నికయ్యారు.

జీవరత్నం కుటుంబానికి ఆర్థిక సాయం

కొత్తపల్లి: ఉప్పాడకు చెందిన పలివెల జీవరత్నం ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందాడు. జీవరత్నంతో పాటు స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 1998–99కి చెందిన పదో తరగతి విద్యార్థులు మంగళవారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అప్పటి విద్యార్థులందరూ సేకరించిన రూ.30వేలను జీవరత్నం కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జోకా ప్రసాద్, చక్రధర్, వీరబాబు, లోవరాజు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



జీవరత్నం కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

అపర్ణాదేవికి పుష్పాలంకరణ

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసియున్న అపర్ణాదేవి అమ్మవారికి శ్రావణ మంగళవారం సందర్భంగా పుష్పాలంకరణ పూజలు నిర్వహించినట్టు ఆలయ అర్చకులు ఆకొండి ప్రభాకరశాస్త్రీ తెలిపారు. కనకాంబరాలు, మల్లెలు, విరజాజులు, సంపెంగలు పారిజాతాలు, చామంతులు, కందబ, తెల్ల జిల్లేడు, లిల్లీ తదితర పుష్పాలతో అమ్మవారికి ప్రత్యేక అర్చనల అనంతరం అలంకరణ చేశారు. ఈసందర్భంగా అమ్మవారిని పలువురు భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

పెద్దాపురం: స్కీమ్ వర్కర్లుగా పనిచేస్తున్న వారందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, యాప్‌లను రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పెద్దాపురం ప్రాజెక్టు మహాసభ డిమాండ్ చేసింది. స్థానిక యాసలపు సూర్యారావు భవన్‌లో మంగళవారం సంఘం మహాసభ దాడి బేబి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చాలా నిర్లక్ష్యంగా చూస్తున్నాయన్నారు. నిత్యం బాలింతలు, గర్భిణులు, చిన్నపిల్లలకు సేవ చేస్తున్న అంగన్‌వాడీలు రక్త హీనతతో బాధపడుతున్నారన్నారు. ప్రజలకు నాణ్యమైన సరకులు అందజేస్తామని చెప్పిన ప్రభుత్వాలు నాసిరకం సరకులు సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. కోడిగ్రుడ్లు కూడా సక్రమంగా అందించడం లేదని, పనిచేయని సెల్ ఫోన్లు ఇచ్చి వాటినే ఉపయోగించాలని చెబుతున్నారన్నారు. ఈ మహాసభలో జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్ష, కార్యదర్శులుగా పద్మ, ఎస్తేరు రాణి

ఏపీ అంగన్‌వాడీ ప్రాజెక్టు వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులుగా టీఎల్ పద్మ, కార్యదర్శిగా ఎస్తేరు రాణి, కోశాధికారిగా టి.నాగమణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షురాలిగా దాడి బేబి, త్రిప్ట్ కార్యదర్శిగా మహాలక్ష్మి, సోషల్ మీడియా బాధ్యురాలుగా లోవకుమారి, ఆఫీస్ బేరర్లుగా చల్లా స్నేహలత, తులసి, ఎస్ కే పాపాయమ్మ, లోవలక్ష్మి, వెంకటలక్ష్మి, వాణి, లోవకుమారి తదితరులు ఎన్నికైనట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి తెలిపారు.



మహాసభలో ప్రసంగిస్తున్న చెక్కల రాజ్‌కుమార్

అనుమతి ఉన్న పురుగు మందులు విక్రయించాలి

కొత్తపల్లి: పురుగుమందుల దుకాణాల్లో అనుమతులు ఉన్న మందులు మాత్రమే విక్రయించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జోగిరాజు అన్నారు. రమణక్కపేటలో ఉన్న పురుగు మందుల దుకాణాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అధికంగా అమ్ముడయ్యే పురుగుమందుల నమూనాలను సేకరించారు. రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు మండలంలో ఉన్న ఎరువుల షాపుల్లో పురుగుమందుల నమూనాలు సేకరించి, వాటిని ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. అనుమతులు లేని, కాలం చెల్లిన పురుగుమందులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పురుగుమందులు కొనుగోలు చేసేటప్పుడు రైతులు గమనించాలన్నారు. పురుగుమందుల కొనుగోలు చేసిన రసీదులను భద్రపరుచుకోవాలని సూచించారు. స్టాక్ నిల్వకు సంబంధించి బోర్డులో ఎప్పటికప్పుడు వివరాలు ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు.